భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదినం

- సర్వమానవాళి కోసం సామూహికంగా దువా
- తక్బీర్ నినాదాలతో మార్మోగిన మసీదులు
- ఈద్గా మైదానాల్లో సామూహిక నమాజులు

యడ్లపాడు: మత సామరస్యం, త్యాగం, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచే పవిత్ర బక్రీద్ (ఈద్-ఉల్-అద్హ) పర్వదినాన్ని యడ్లపాడు మండలంలోని ముస్లిం భక్తులు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పిల్లలు, యువకులు, పెద్దలు అందరూ కలిసి మసీదులు, ఈద్గా మైదానాల వైపు తరలివెళ్లారు. బోయపాలెం, యడ్లపాడు పరిసర గ్రామాల్లోని ఈద్గా మైదానాలు ఉదయం 8 గంటలకే భక్తులతో నిండిపోయాయి. గ్రామాల్లోని మసీదులు, వీధులు పండుగ వాతావరణంతో కళకళలాడాయి.

నరసరావుపేటలో..

నరసరావుపేట ఈస్ట్: త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లోని ఈద్గా మైదానంలో ముస్లింలు శ్రీరాంపురం జామియా మసీద్ షేష్ ఇమాం షాహిద్ రజా ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు జరిపారు. ఈసందర్భంగా షాహిద్ రజా మాట్లాడుతూ, తోటివారి పట్ల సోదర భావంతో మెలగాలని హితవు పలికారు. ఖురాన్ బోధనలను అనుసరించి జీవించాలని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సామూహిక ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ త్యాగానికి, ఐక్యతకు ప్రతీకగా పేర్కొన్నారు.


నరసరావుపేట ఈద్గా మైదానంలో ప్రార్థనలు


బోయపాలెం ఈద్గా వద్ద ..


వినుకొండలో ..

వినుకొండలో...

వినుకొండ: బక్రీద్ పర్వదిన వేడుకలు వినుకొండలో ఘనంగా నిర్వహించారు. ఉదయంనుంచే ముస్లిం సోదరులు తిమ్మాయపాలెం రోడ్డులోని ఈద్గావద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు ముజావరులు, బక్రీద్ సందేశం వినిపించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని గోగులపాడు, రొంపిచర్ల, సంతగుడిపాడు, కర్లకుంట, విప్పర్ల, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట, అన్నవరం, మునుమాక, అలవాల, విప్పర్లపల్లి గ్రామాలలో గల ఈద్గాల వద్ద, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ముఫ్తీ పఠాన్ అనస్‌ఖాన్ చెప్పారు. బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. ఉదయం అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఉన్న ఈద్గా మైదానంలో వేలాది మంది సామూహిక నమాజు చేశారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: భగవంతుడిపై అచంచల విశ్వాసం, త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినమని ముస్లిం మత పెద్ద, ఇమామ్ సర్ఫరాజ్ చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సేవా సంఘం రాష్ట్ర నాయకుడు షేక్ బాజీ పాల్గొన్నారు. సాతులూరులో జరిగిన కార్యక్రమంలో ఇమామ్‌లు అబ్దుల్ హాఫీజ్, మహమ్మద్ అలి, వసీం, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, శానంపూడి, కారుమంచి, శావల్యాపురం, పోట్లూరు, మతుకుమల్లి తదితర గ్రామాల్లో బక్రీదు పర్వదినం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.



విద్యాకేంద్రం నరసరావుపేట

కిండర్ గార్డెన్ నుంచి ఇంజినీరింగ్ వరకు విద్యావకాశాలు

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట ఒక ఎడ్యుకేషనల్ హబ్‌గా మారింది. ఇంజినీరింగ్, ఫార్మసీ, పీజీ, డిగ్రీ, ఇంటర్ నుంచి ఎల్‌కేజీ వరకు పేద, మధ్యతరగతి వర్గీయులు సైతం చాలా సులభంగా విద్యాబుద్ధులు నేర్చుకునే అవకాశం ఇక్కడ నెలకొంది. గత 70 ఏళ్ల చరిత్రను చూస్తే రాయలసీమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎంతోమంది దేశంతో పాటు ప్రపంచంలోని అనేక దేశాలలో ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు కారణమైంది. 1960లో ఏర్పాటైన శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల (ఎస్ఎస్ఎన్) విద్యాకేంద్రానికి శ్రీకారం చుట్టింది. ఆ తర్వాత శ్రీమతి కాసు రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి డిగ్రీ, జూనియర్ కళాశాలలు, కొత్త రఘురామయ్య జూనియర్, డిగ్రీ కళాశాలలో ఇంటర్, డిగ్రీ విద్యకు ఉన్న ప్రాధాన్యత మేరకు 1990 వరకు ఈ కళాశాలలకు రాయలసీమ నుంచి వేలాదిమంది విద్యార్థులు వచ్చి ఇక్కడ చదువుకున్నారు. 2002లో ఏర్పాటైన నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల (ఎన్ఇసీ)తో ఇంజినీరింగ్ విద్యకు బీజం పడింది. ఆ తర్వాత ఏడు ఇంజినీరింగ్ కళాశాలలో పట్టణ చుట్టు పక్కల ఏర్పాటై వేలాదిమంది యువతీ యువకులు ఇంజినీరింగ్ చదువుకునేందుకు అవకాశం దక్కింది. ఆ తర్వాత ఫార్మసీ, నర్సింగ్, పీజీ, ఐటీఐ మెన్ అండ్ ఉమెన్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. గత ప్రభుత్వంలో జేఎన్‌టీయూ కళాశాల సైతం రూరల్ పరిధిలోని కాకాని గ్రామ సమీపంలో 85 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైంది. ఈ రోజున పట్టణం, చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతిరోజూ సుమారుగా 30 వేల మంది విదార్థిని విద్యార్థులు విద్యాలయాలకు రాకపోకలు సాగిస్తున్నారు. నరసరావుపేట అంటే ఒక విద్యాకేంద్రమనే వాతావరణం ఏర్పడింది. దీనికి తగ్గట్టుగా 2022లో పల్నాడు జిల్లాకు నరసరావుపేట కేంద్ర బిందువు అయ్యేందుకు రాజకీయాలతో పాటు విద్యావకాశాలు కూడా ఒక కారణంగా చెబుతారు. నిండు వేసవితో పాటు ఏడాది మొత్తం రెండుపూటలా తాగునీటి సరఫరా, మధ్యతరగతి వర్గీయులు భరించకల్గిన ఇళ్ల అద్దెలు, సామాన్య ప్రజలు ప్రశాంతంగా ఉండేందుకు అవకాశాలు ఉండటంతో ఈ పట్టణం ఎడ్యుకేషనల్ హబ్‌గా పేరుగడించింది.



ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రవేశ ద్వారం

మహిళలు, రైతులు, యువత అభివృద్ధికి ఎస్‌బీఐ చేయూత

ఎస్‌బీఐ ఆర్ఎం పి.రవికుమార్

నరసరావుపేట: మహిళలు, రైతులు, యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చేయూతనిస్తుందని రీజనల్ మేనేజర్ పి.రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక పల్నాడు రోడ్డులోని ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయంలో ప్రకాష్‌నగర్ ఎస్‌బీఐ (ఏడీబీ)శాఖ ఆధ్వర్యంలోశనివారం మహిళలు, రైతులు, యువత అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీజనల్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలలోని మహిళలకు లక్ష నుంచి రూ.10 లక్షల వరకు వ్యాపార నిమిత్తం, నాలుగు ఎకరాలు పైబడిన రైతులకు కోటి రూపాయల వరకు, యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి రుణాలను అందజేస్తున్నామన్నారు. వారు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌బీఐ (ఏడీబీ) శాఖ మేనేజర్ ఎం.పాల్‌బెజాలీల్, ఫీల్డ్ ఆఫీసర్ ఎం.రమణయ్య, వెలుగు ఏపీఎం భరత్, సీసీలు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

నాదెండ్ల: గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు ఆవశ్యకత ఉందని ఎస్సై జి.పుల్లారావు చెప్పారు. ఇటీవల సాతులూరు గ్రామంలో జరిగిన పలు నేరాలపై గ్రామస్తులతో శనివారం చర్చించారు. ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే నేరాల నియంత్రణ, కేసుల పరిశోధన సాధ్యమౌతుందన్నారు. ఒకవేళ నేరం చోటు చేసుకుంటే నిందితుల గుర్తింపునకు వీలౌతుందన్నారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తుల సహకారం అవసరమన్నారు.

పెనుగొండకు నివాళి

నరసరావుపేట ఈస్ట్: పేద విద్యార్థుల ఉన్నత విద్యకు సహకరిస్తూ వారికి స్కాలర్‌షిప్‌లను అందించిన శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కళాశాల ఆడిటోరియంలో శనివారం వెంకటేశ్వరరావు సంతాపసభ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, కమిటీ సభ్యులు, వెంకటేశ్వరరావు కుమారులు ప్రభాకరరావు, ప్రతాప్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.